క్లుప్తంగా

మోతె ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా హరిసింగ్‌నాయక్



మోతె : మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా మండలంలో ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న హరిసింగ్‌నాయక్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు శనివారం జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో హరిసింగ్ నాయక్ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు.

మంత్రి ఉత్తమ్‌ను కలిసిన నాయకులు



ఉత్తమ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచ్ అప్పారావు తదితరులు

కోదాడరూరల్ : మండలంలోని రెడ్లకుంట గ్రామ సర్పంచ్ సాధినేని లీలా అప్పారావు ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డిని ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపినట్లు వెల్లడించారు.

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం హర్షణీయం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు

మునగాల : తెలంగాణ రాష్ట్రం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా మహాలక్ష్మి పథకం క్రింద మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం హర్షణీయమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని కొక్కిరేణి గ్రామంలో నిర్వహించిన పార్టీ గ్రామ శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పలు గ్రామాల్లో నేటికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ఈ పథకం పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావడం లేదన్నారు. ఇందు కోసం ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ గ్రామశాఖ కార్యదర్శి నందిగామ సైదులు, మాజీ సర్పంచ్ రావులపెంట వెంకన్న, ఉపసర్పంచ్ రావులపెంట బ్రహ్మం, సింగిల్ విండో డైరెక్టర్ నిడిగొండ శంభయ్య, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు వట్టెపు చినసైదులు, ములకపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం యూత్ అధ్యక్షుడిగా వీరస్వామి

మోతె : కోదాడ నియోజకవర్గం వడ్డెర సంఘం యూత్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన తుర్క వీరస్వామి ఆదివారం ఎన్నికైనట్లు ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వేముల వీరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ.. వడ్డెర్ల అభివృద్ధికి సహకారంగా ఉంటానన్నారు. తన ఎన్నికకు సహకరించిన సంఘం జిల్లా కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బొంత సురేష్, పల్లపు సైదులు, శివరాత్రి వెంకటేశం పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో పూజలు



ఆలయంలో కాంగ్రెస్ నాయకులను సన్మానిస్తున్న యాదవ సంఘం సభ్యులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని గంగమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం యాదవులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు ఉత్తమ్ దంపతులు గెలవడంతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పోట్టేలు బలిచ్చారు. కార్యక్రమంలో యాదవసంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

నడిగూడెం : విద్యుదాఘాతంతో ఓ ఆవు మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని వేణుగోపాలపురంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చందా శ్రీను ఆవు ఆదివారం గ్రామసమీపంలో మేతకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఆవు మేత మేసుకుంటూ పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగకు తగిలింది. దీంతో ఆవు విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. మృతి చెందిన ఆవును గ్రామసర్పంచ్ గండమళ్ల స్వరూప సందర్శించి, బాధితుడికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

మూగజీవాలకు అందని వైద్యం

- పశువైద్యశాలల్లో వేధిస్తున్న సిబ్బంది కొరత
- సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- గణపవరం, తొగర్రాయి, కొమరబండ సబ్‌సెంటర్‌లో సిబ్బంది నిల్
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



సిబ్బందిలేని గణపవరంలోని పశువైద్యశాల

కోదాడరూరల్ : మూగజీవాలకు వైద్యం అందించేందుకు పశువైద్యశాలల్లో సరిపడా సిబ్బంది లేక పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు పశుసంపదను అభివృద్ధి చేస్తాం అందుకు కావాల్సిన నిధులకు కూడా పెద్ద పీటవేస్తున్నాం అంటున్నారనే తప్ప వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. మండలంలోని ఆయా గ్రామాలో ఏర్పాటు చేసిన పలు సబ్‌సెంటర్లలో సిబ్బంది లేక గ్రామాల్లో మూగజీవాలకు సరైన వైద్యం అందడంలేదు. అంతే కాకుండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పశు సబ్‌సెంటర్ల భవనాలు కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. మండలంలో మేజర్ గ్రామపంచాయతీలైన గణపవరం, తొగర్రాయి, కొమరబండ పశువైద్య సబ్‌సెంటర్లలో ఒక్కరు కూడా సిబ్బంది లేక ఆయా గ్రామాల్లో పాడి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మూడేళ్లుగా ఇక్కడ వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో మూగజీవాలకు వైద్యం అందని పరిస్థితి. మరో చోట విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని వారంలో రెండు మూడు రోజులు ఇన్‌చార్జ్‌లుగా వస్తూ విధులు నిర్వహిస్తున్నారు. ఈ మూడు గ్రామాల్లో జీవాలు దాదాపుగా 6000, పశువులు 4200వరకు ఉన్నాయి. ఇక్కడ వైద్య సిబ్బంది లేకపోవడంతో దూరంగా ఉన్నచోటకు పశువులు, జీవాలను తీసుకెళ్లడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అదే కాకుండా సకాలంలో వైద్య అందక మూగజీవాలు మృత్యువాతపడుతున్నాయని పలువురు పాడిరైతులు వాపోతున్నారు. ప్రభుత్వం అన్ని పశువైద్యశాలు, సబ్‌సెంటర్లలో పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించి పాడి, జీవాల పెంపకందారులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆయా గ్రామాల్లో రైతులు కోరుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో గేదెలు 22000, ఆవులు 4500, గొర్రెలు 27000, మేకలు 8700వరకు ఉన్నాయి.

శిథిలావస్థకు చేరుకున్న పశువైద్య ఆరోగ్య ఉపకేంద్రాలు..

మండలంలోని గుడిబండ, తొగర్రాయి, గణపవరం, కొమరబండ, తమ్మర, చిమిర్యాల, నల్లబండగూడెం గ్రామాల్లో గతంలో పశువైద్య ఉపకేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిలో తొగర్రాయి, నలబండగూడెంలో మాత్రమే నూతనంగా భవనాలు నిర్మించగా మిగిలిన గణపవరం, కొమరబండ, తమ్మర, చిమిర్యాల సెంటర్ల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిలో విధులు నిర్వహించాలంటే సిబ్బంది ఎప్పుడు కూలుతుందోనని బయపడాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని, అదేవిధంగా సిబ్బంది కొరత ఉన్న చోట సిబ్బందిని నియమించి మండలంలో పూర్తిస్థాయిలో పశువైద్యం అందే విధంగా చూడాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

పూర్తి స్థాయిలో వైద్యసిబ్బందిని నియమించాలి



“ తొగర్రాయి పశువైద్యశాల సబ్‌సెంటర్‌లో పూర్తి స్థాయిలో వైద్యసిబ్బందిని నియమించి పాడి, జీవాల పెంపకందారులకు ఇబ్బంది లేకుండా చూడాలి. ఇక్కడ జీవాలు, గేదెల పెంపకంపై ఆధారపడి అనేక మంది రైతులు ఉన్నారు. వైద్యసిబ్బంది లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వైద్యం కోసం జీవాలను తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బందిని నియమించి సమస్యలు పరిష్కరించాలి.

– అమరనేని వెంకటేశ్వరరావు, తొగర్రాయి

సిబ్బంది కోసం ప్రతిపాదనలు పంపాం



“ మండలంలో ఖాళీగా ఉన్న గణపవరం, తొగర్రాయి, కొమరబండ సబ్ సెంటర్లలో ఖాళీగా ఉన్న సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. త్వరలోనే నియమించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఖాళీలు ఉన్న చోట ఇన్‌చార్జ్‌లను నియమించి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

– నాగేంద్రబాబు, మండల పశువైద్యాధికారి

విద్యార్థుల్లో పోటీతత్వం పెంచేందుకే టాలెంట్ టెస్ట్‌లు



పరీక్ష పేపర్‌ను విడుదల చేస్తున్న సీఐ రాము, మేకల శ్రీనివాసరావు

కోదాడఅర్బన్ : పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో పోటీతత్వం పెంచేందుకే టాలెంట్ టెస్ట్‌లు ఉపయోగపడతాయని కోదాడ పట్టణ సీఐ టి.రాము, ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు మేకల శ్రీనివాసరావు, ఎస్ఆర్ఎస్ జూనియర్ కళాశాల చైర్మన్ వడ్డే రాజేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్ఆర్ఎస్ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌ల ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ టెస్ట్‌కు సంబంధించిన ప్రశ్నాపత్రాన్ని వారు విడుదల చేసి మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు అవగాహన పెంచేందుకు ఇలాంటి టాలెంట్ టెస్ట్‌లు ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. విద్యార్థులు రానున్న పరీక్షల్లో మంచి మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించాలని వారు కోరారు. అనంతరం ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చేపూరి కొండలు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్‌లు మాట్లాడారు. ఈ టెస్ట్‌లో మొత్తం 736మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. టాలెంట్‌టెస్ట్‌లో విజేతలకు త్వరలోనే బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాలకు చెందిన మనోహర్‌రెడ్డి, వేణుగోపాల్, ప్రియాంక, కుమారి, మహేశ్వరి, లక్ష్మీపార్వతి, మేఘన, సాయికీర్తి, ఆకాంక్ష, నందిని తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరంలో రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్యబృందం

కోదాడఅర్బన్ : ఉచిత వైద్యశిబిరాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కోదాడలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏఐటీయూసీ, సీఎస్‌సీ హెల్త్ కేర్‌ల ఆధ్వర్యంలో భవన నిర్మాణ, ఇతర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో వైద్యం అందక అనేక మంది కార్మికులు శాశ్వత అంగవైఖ్యలాలుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన వైద్యం అందక కార్మికులు కొంత మంది మృత్యువాత పడుతున్నారని అన్నారు. ఉచిత వైద్య శిబిరాల ద్వారా పేద కార్మికులకు వైద్యం అందుతుందన్నారు. ఈ వైద్యశిబిరంలో సుమారు 1000మంది కార్మికులు పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు లతీఫ్, నాగరాజు, జానీ, మల్లయ్య, మీరా, సీఎస్‌సీ జిల్లా కోఆర్డినేటర్ తారీక్, ఎం శ్రీనివాసులు, రాకేష్, డాక్టర్ల బృందం పాల్గొన్నారు.

బేతవోలు సొసైటీలో అవిశ్వాస ముసలం..!

- 13మంది డైరెక్టర్లకుగాను 9మంది కాంగ్రెస్ వైపు
- మండలంలో మారుతున్న రాజకీయ పరిణామాలు
- జోరుగా పావులు కదుపుతున్న అధికార పార్టీ నాయకులు



బేతవోలు ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం

చిలుకూరు : మండలంలోని బేతవోలు ప్రాథమిక సహకార సంఘంలో అవిశ్వాస ముసలం మొదలైంది. సంఘంలో 13మంది డైరెక్టర్లకుగాను 9మంది డైరెక్టర్లు కాంగ్రెస్ వైపు, మరో ముగ్గురు బీఆర్ఎస్ వైపు ఉండగా, ఒకరు ఇరువురు మధ్య ఊగిసలాటలో ఉన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒకరు ప్రస్తుత చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టి తాను చైర్మన్ కావాలని ముమ్మరంగా పావులుకదుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. బేతవోలు ప్రాథమిక సహకార సంఘం పరిధిలో బేతవోలులో 5మంది డైరెక్టర్లు, జెర్రిపోతులగూడెం, కొండాపురంలో రెండు చొప్పున నలుగురు డైరెక్టర్లు, ఆచార్యులగూడెం, చెన్నారిగూడెం, పోలేనిగూడెం, కొమ్ముబండతండాలో గ్రామానికి ఒకరూ చొప్పున మొత్తం 13మంది ఉన్నారు. 2020 ఫిబ్రవరిలో జరిగిన సహకార సంఘం ఎన్నికల్లో అప్పుడు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే అనుచరుడు కొండాపురం గ్రామానికి చెందిన డైరెక్టర్ బాషం సైదులు చైర్మన్‌గా నియమితులయ్యారు. వైస్‌చైర్మన్‌గా బేతవోలు గ్రామానికి చెందిన అక్కినపల్లి జానకీరామాచారీ ఎన్నికయ్యారు. అ సమయంలో చైర్మన్ వైపు 8మంది డైరెక్టర్లు, మరో వర్గం వైపు 5గురు డైరెక్టర్లు ఉన్నారు.

సంఘం ఏర్పాటు నుంచి ఘర్షణలే..

కాగా సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైన నాటి నుంచి సంఘంలో రెండు వర్గాలు ఉన్నాయి. అయితే సంఘం ఏర్పాటైన రెండేళ్ల నుంచి చైర్మన్‌పై పలు ఆరోపణలు చేస్తూ జిల్లా కలెక్టర్‌కు, సహకార సంఘం జిల్లా అధికారికి పలువురు డైరెక్టర్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పలుమార్లు సంఘంలో విచారణలు, ఘర్షణలు చోటు చేసుకున్నాయి. దీంతో వేసి చూసిన ప్రతి పక్షవర్గాలు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యేగా పద్మావతి గెలవడంతో ఒక్కసారిగా రాజకీయం మారిపోయింది.

చైర్మన్ రేసులో బజ్జూరి రవీందర్‌రెడ్డి..

ప్రస్తుత చైర్మన్‌పై బాషం సైదులు, వైస్‌చైర్మన్ అక్కినపల్లి జానకీరామాచారి, బేతవోలుకు చెందిన ఓ డైరెక్టర్ తాళ్లూరి ప్రసాద్, కొండాపురం డైరెక్టర్ పాయిలీ కృష్ణ మాత్రమే బీఆర్ఎస్‌లో ఉన్నారు. మిగతా 9మంది డైరెక్టర్లు కాంగ్రెస్‌లో ఉన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన బేతవోలు గ్రామానికి చెందిన డైరెక్టర్ బజ్జూరి రవీందర్ రెడ్డి చైర్మన్ పదవి దక్కించుకోవడం కోసం ముమ్మరంగా పావులు కదుపుతున్నారు. వారంలోపే ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. దీంతో బేతవోలు సొసైటీ అవిశ్వాస రాజకీయం రసవత్తరంగా మారింది. అయితే బేతవోలు సర్పంచ్ వట్టికూటి నాగయ్య, ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీష నాగేంద్రబాబు అండదండలు బజ్జూరి రవీందర్‌రెడ్డి వైపు ఉండడం గమనార్హం.

ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం



హుజూర్‌నగర్‌రూరల్ : ధనుర్మాస పూజల్లో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీ వేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో గోపూజతో, శ్రీ జ్ఞానసరస్వతి ఆలయంలో ప్రాతఃకాలంలో ధనుర్మాస ఉత్సవాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవాచనం చేసి దేవాలయం చుట్టూ ప్రదక్షిణ గావించారు. ఉత్సవాల సందర్భంగా దేవాలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో, మామిడి తోరణాలతో అలంకరించారు. మొదట విష్ణుసహస్రం, గోదా, రామానుజఅష్టోత్తరాలు చేసి గోదాదేవి రచించిన తిరుప్పావైని మహిళలు శ్రావ్యంగా గానం చేశారు. సాయంత్రం పల్లకి సేవతో దేవాలయం గోవింద నామాలతో జై శ్రీమన్నారాయణ నామాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఇదిలా ఉండగా అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ అధికారి, పూజారులు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీశాల్మలీకంద ఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో ఆదివారం ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, పుణ్యాహవచనం, శ్రీగోదాదేవి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర శత నామావళి, గోత్రనామాలు, సేవాకాలం, ఆళ్వార్లకు మంగళాశాసనం, మొదటి పాశురతాత్పర్యం, గోమాతకు పూజ కార్యక్రమాల అనంతరం గోదాదేవి అమ్మ వారికి పల్లకిసేవ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ ఎంపీ లక్ష్మణరావు, ధర్మకర్తలు సురభి కుషల్, సైదులు, వెంకటేశ్వరరావు, అర్చకులు ముడుంబై మనోహరాచార్యులు, హరీష్‌కుమార్ చార్యులు, సిబ్బంది కిరణ్‌కుమార్, రమేష్, ఉపేందర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని పోనుగోడు గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం, గరిడేపల్లిలోని రామాలయం, కల్మలచెరువు వేంకటేశ్వరస్వామి దేవాలయం, కీతవారిగూడెం గ్రామంలోని శివాలయంతో పాటు పలు గ్రామాల్లో ధనుర్మాస ఉత్సవాలు పూజారులు వేదమంత్రాల మధ్య అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈసందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారులు అలహరి నరసింహాచార్యులు, సుదర్శనం శ్రీనివాసచార్యులు, రాయపోలు శ్రీరామశర్మ, భద్రశర్మ, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంతో పాటు సిరిపురం శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు సుప్రభాతం, అర్చన, కుంకుమ సహస్ర నామార్చన, తిరుప్పావై నివేదన, నీరాజన మంత్ర పుష్ప తీర్థప్రసాద పూజలు నిర్వహించారు. గోదాదేవికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాల ప్రధాన అర్చకులు వేదాంతం చక్రధరాచార్యులు, వరదాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



గరిడేపల్లి : పోనుగోడులో ధనుర్మాస ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు



హుజూర్‌నగర్ : శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో వేదప్రవచనం చేస్తున్న అర్చకులు



హుజూర్‌నగర్ : శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో పాశుర పఠనంలో భక్తులు

డీఎస్ నకారా చేసిన కృషి మరువలేనిది



హుజూర్‌నగర్ : రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న పెన్షనర్లు



కోదాడఅర్బన్ : నకారా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

హుజూర్‌నగర్ : పెన్షనర్ల కోసం రిటైర్డ్ ఉద్యోగి డీఎస్ నకారా చేసిన కృషి మరువలేనిదని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని పెన్షనర్ల కార్యాలయంలో జాతీయ పెన్షనర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడారు. డీఎస్ నకారా పోరాట పటిమ కారణంగానే నేడు రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ వస్తుందన్నారు. ప్రతిఒక్కరూ డీఎస్ నకారా చేసిన త్యాగాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగులు ఆర్.యాకోబ్, వి.లచ్చారావు, జక్కుల మల్లయ్య, సోమ అచ్చయ్య, పూస కృష్ణమూర్తి, సావిత్రిని శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆర్.యాకోబ్ కుటుంబ సభ్యులు పెన్షనర్ల కార్యాలయానికి రూ.15వేల విలువ గల టీవీని బహూకరించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంబాబు, సంఘం నాయకులు చెన్నా సోమయ్య, రఘునాథ్, చంద్రశేఖర్, మోహినుద్దీన్, వి.నర్సయ్య, ఎంఎస్ఎన్ రాజు, లక్ష్మయ్య, వేముల వెంకటేశ్వర్లు, జక్కుల వెంకటేశ్వర్లు, పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పెన్షనర్స్ డే

కోదాడఅర్బన్ : పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో ఆదివారం జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షన్ల కోసం పోరాడిన నకారా చిత్రపటానికి విశ్రాంత ఉద్యోగుల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు ఆర్.సీతారామయ్య, శ్రీనివాసరావు, సుదర్శన్‌రెడ్డి, రాంబాబు, వెంకటేశ్వరరావు, లక్ష్మీనర్సయ్య, వరప్రసాద్, భిక్షం పాల్గొన్నారు.

వెంకట్‌రెడ్డికి ఘన నివాళి



బాణాల వెంకట్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

చిలుకూరు : కోదాడకు చెందిన వాగ్దేవి, రేస్ కళాశాల ఫౌండర్ బాణాల వెంకట్‌రెడ్డి వర్ధంతిని ఆదివారం మండలంలోని నారాయణపురం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మంచి విద్యావేత్తగా వెంకట్‌రెడ్డి చిరస్మరణీయుడు అని కొనియాడారు. అనంతరం వెంకట్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానిమియా, సర్పంచ్ తమ్మనబోయిన శంకర్, ఎంపీటీసీ మండవ శైలజ చిన్నా, మాజీ సర్పంచ్ మండవ వెంకటేశ్వర్లు, తమ్మనబోయిన శ్రీను, బూర లక్ష్మీనారాయణ, అంబేద్కర్, జానీ, ఏసు, కొండలు, వీరబాబు, ధనమూర్తి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కళాకారులకు అభినందన

హుజూర్‌నగర్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తాడేపల్లిగూడెంలో జరిగిన ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాల్లో నియోజకవర్గానికి చెందిన పలువురు కళాకారులు పాల్గొని అద్భుత ప్రదర్శనలు ఇచ్చారు. దీంతో ఆదివారం కళాకారుల సంఘం నాయకులు వారికి అభినందనలు తెలిపారు. పౌరాణిక, జానపద–నాటక పదర్శనలతో ఆకట్టుకున్నారు.

కనులపండువగా కావడి మహోత్సవం

భానుపురి : పట్టణంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా పాలకావడి మహోత్సవాన్ని ఆదివారం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్య సమేత శ్రీవల్లి శివ విగ్రహాలతో పాటు పాలకావడిల శోభాయాత్ర చేపట్టారు. అనంతరం శ్రీరామ లింగేశ్వర ఆలయ ప్రధాన అర్చకుడు రెంటాల సతీష్ శర్మ మాట్లాడారు. సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా దేవాలయంలో మూడు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మొదటి రోజు ఆదివారం పాల కావడి మహోత్సవాన్ని నిర్వహించినట్లు తెలియజేశారు. ఈ నెల 18న ఉదయం ఏడు గంటలకు స్వామి అమ్మవార్లకు అభిషేకం, 10 గంటలకు సుబ్రహ్మణ్య శ్రీవల్లి దేవసేన కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మాతృవంశ, పితృవంశ దోష నివారణకు కర్ణాటకలో నిర్వహించే అశ్లేష బలిపూజ సర్పబలిహరణ ఉంటుందని తెలిపారు. వివాహం కాని, సంతానం లేని స్త్రీ పురుషులకు ప్రత్యేకంగా రాత్రి 7 గంటలకు సర్పకార దీపోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. 19న నారాయణ బలి పూజ, సుబ్రహ్మణ్య యాగం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు అనంతుల సూర్యనారాయణ, అనంతుల దుర్గాప్రసాద్, అనంతుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో శోభాయాత్ర నిర్వహిస్తున్న సభ్యులు, భక్తులు

అయోధ్య రామాలయ అక్షింతల ఊరేగింపు



నడిగూడెం : సాయి మందిరంలో రామ జన్మభూమి అక్షింతలతో భక్తులు



నేరేడుచర్ల : పూజలు నిర్వహిస్తున్న వాసవీ, వనితా క్లబ్ సభ్యులు

నడిగూడెం : మండల కేంద్రంలోని వీరాంజనేయ దేవస్థానం నుంచి శ్రీ షిర్డీ సాయి మందిరం వరకు ఆదివారం రాత్రి అయోధ్య రామజన్మభూమి నుంచి వచ్చిన అక్షింతలను ఘనంగా ఊరేగించారు. అనంతరం భక్తులు పూజలు నిర్వహించారు. అక్షింతలను మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో భక్తులకు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్చకులు రాజశేఖర్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

నేరేడుచర్లకు చేరిన రామాలయ అక్షింతలు

నేరేడుచర్ల : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య రామాలయం నుంచి కలశాలలో అక్షింతలు ఆదివారం సాయంత్రం నేరేడుచర్లకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అక్షింతలను పూర వీధుల్లో ఊరేగించి మండల కేంద్రంలోని సాయిబాబా మందిరం ప్రాంగణంలో గల ఆంజనేయస్వామి విగ్రహానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ, వనితా క్లబ్ అధ్యక్షులు కొత్త లక్ష్మణ్, వీరవల్లి శ్రీలత, కిషన్, ప్రభాకర్, కోటేశ్వర్‌రావు, శ్రీను, మోహన్ తదితరులున్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం



కోదాడరూరల్ : అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న దాతలు, నిర్వాహకులు

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం దాతలు వనమా వెంకటేశ్వరరావు, కొల్లు కోటేశ్వరరావు కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో 550 మంది మాలధారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాసునాయుడు, బర్మావత్ సీతరాంసింగ్, గడ్డం సూర్యారెడ్డి, నాగరాజు, రంగా మాలధారులు తదతరులు ఉన్నారు.

కోదాడఅర్బన్ : పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో ఆదివారం మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పట్టణానికి చెందిన దాతలు మద్దినేని హనుమంతరావు, లక్ష్మమ్మ, వారి కుటుంబ సభ్యులు, యాదా వెంకన్న, నీలిమ వారి కుటుంబ సభ్యుల ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 500మందికి పైగా మాలధారులు పాల్గొన్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రేపాల ప్రసాదరావు, చల్లా రామ్మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జ్ఞాపిక, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో గురుస్వామి రామనాథం, దాతల కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, మాలధారులు పాల్గొన్నారు.